క్లుప్తంగా

పిచ్చి కుక్క స్వైర విహారం

కమలాపురం : పట్టణ పరిధిలోని మీరాపురం గ్రామంలో పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. మంగళవారం గ్రామానికి చెందిన అరుణ, సుబ్బమ్మ, సుబ్బరాయుడు అనే ముగ్గురిపై పిచ్చి కుక్క దాడి చేసి గాయ పరిచింది. ఇందులో అరుణ అనే మహిళకు కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందారు. అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి తమను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. పట్టణంలో సైతం వీధి కుక్కలు విపరీతంగా ఉన్నాయని, వాటిని మున్సిపల్ అధికారులు నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

రెస్టారెంట్ ఆకస్మిక తనిఖీ

వేంపల్లె : పులివెందుల రోడ్డులో ఉన్న విహారి రెస్టారెంట్‌ను ఫుడ్ సేఫ్టీ అధికారి హరిత మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విహారి రెస్టారెంట్‌లో ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉంచిన చికెన్‌ను గుర్తించి బయటపడేశామని తెలిపారు. అలాగే ఫ్రిడ్జ్, కిచెన్ పరిశుభ్రత విషయమై క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు టెస్టింగ్ సాల్ట్, కలర్ వాడకాలపై తనిఖీలు నిర్వహించామన్నారు. రిపోర్టుల అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ సిబ్బంది, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జన సురక్ష బీమా పథకం ఎంతో ఉపయుక్తం

లింగాల : జన సురక్ష బీమా పథకం ఎంతో ఉపయుక్తమైందని ఏపీ గ్రామీణ బ్యాంక్ సీనియర్ మేనేజర్ శ్రీధర్ తెలిపారు. ఇప్పట్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఏపీ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో జన సురక్ష బీమా పథకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏపీ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో జన సురక్షతోపాటు జీవనజ్యోతి యోజన పథకం కూడా ప్రవేశపెట్టారన్నారు. సురక్ష బీమా పథకం ద్వారా సుమారు రూ.2లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. అలాగే జీవనజ్యోతి యోజన బీమా పథకం ద్వారా సుమారు రూ.2 లక్షల వరకు సాధారణ బీమా వర్తిస్తుందన్నారు. జీవనజ్యోతి యోజన పథకానికి సంబంధించి 18 ఏళ్ల నుంచి 50 ఏళ్లు, జన సురక్ష బీమా పథకానికి 18 ఏళ్ల నుంచి 70 ఏళ్లలోపు వయస్సు గలవారు అర్హులన్నారు. బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువత హెచ్‌ఐవీపై అప్రమత్తంగా ఉండాలి

జమ్మలమడుగు : యువత హెచ్‌ఐవీ రాకుండా లైంగిక సంబంధాలకు దూరంగా ఉండాలని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శోభ, భారతిలు తెలిపారు. మంగళవారం పట్టణంలోని మిట్టాయిగిరి వీధిలో ఉన్న ఉర్దూ ఉన్నతపాఠశాలల్లో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు రామకృష్ణమ్మ పెండ్లి కాకముందే లైంగిక సంబంధాలు పెట్టుకుంటే వచ్చే అనార్థాల్లో హెచ్‌ఐవీ ఒక్కటి అన్నారు. హెచ్‌ఐవీకి మందులేదని రాకుండా చూసుకోవడమే మన ముందు ఉన్న కర్తవ్యం అన్నారు.

ఆధ్యాత్మిక గ్రంథాలలో సంస్కృత భాష మేటిది

పులివెందుల టౌన్ : ఆధ్మాత్మిక గ్రంథాలలో సంస్కృత భాష మేటిదని హిందు ధర్మప్రచార సమితి సభ్యుడు పెద్దపోతుల ఆంజనేయులు తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో సంస్కృత విభాగ అధ్యక్షులు సాయి నరేంద్రకుమార్‌రెడ్డి, జోజిరెడ్డిల ఆధ్వర్యంలో శ్రావణమాస సంస్కృతి సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

వీరపునాయునిపల్లె : మండలంలోని ఎస్.పాలగిరి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రీజనల్ మేనేజర్ శ్రీనివాస ప్రసాద్ హాజరై మాట్లాడారు. బీమా వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఒఎస్‌డీ అరుణ్‌కుమార్, బ్యాంకు మేనేజర్ వెంకటేసు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

పేదల బతుకులతో ఆటలాడుతున్నారు

- రీ వెరిఫికేషన్ పేరుతో జిల్లావ్యాప్తంగా 7,125 మందికి నోటీసులు
- వైకల్యం ఉన్నా శాతాన్ని తక్కువగా చూపి పింఛన్ల తొలగింపు
- లబోదిబోమంటున్న దివ్యాంగులు


వేంపల్లె ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దివ్యాంగులు


పింఛన్ల తొలగింపుపై ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగులు

వేంపల్లె : దివ్యాంగుల పింఛన్లకు సంబంధించి ప్రభుత్వం రీ వెరిఫికేషన్ పేరిట వైకల్యం తక్కువగా చూపించి తమ బతుకులతో ఆటలాడుతున్నారని దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైకల్యం ఉన్న శాతాన్ని తక్కువ చూపించి పింఛన్లు తొలగించారని మండిపడ్డారు.

అర్హులైన వారి పింఛన్లు తొలగించడం దారుణమని దివ్యాంగులు లబోదిబోమంటున్నారు. కూటమి ప్రభుత్వం పింఛన్ల తొలగింపునకు కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. మండల వ్యాప్తంగా రీ వెరిఫికేషన్ పేరుతో జిల్లావ్యాప్తంగా 7,125 మందికి పైగా దివ్యాంగులకు నోటీసులు జారీ చేసిందన్నారు. తమ పింఛను పునరుద్ధరించాలంటూ మంగళవారం వేంపల్లె మండల పరిషత్ సభ భవనంలో జరుగుతున్న సమావేశంలో దివ్యాంగులు వాపోయారు. అక్కడ ఉన్న ఎంపీడీఓ కుళ్లాయమ్మకు దివ్యాంగులు వినతిపత్రం అందజేసి న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. గత 15 ఏళ్లుగా పింఛను తీసుకుంటున్న దివ్యాంగులకు రీ-వెరిఫికేషన్ పేరుతో తొలగించారన్నారు. వైద్యులు ఉద్దేశపూర్వకంగా వైకల్యం తక్కువ చేసి సర్టిఫికేట్ ఇస్తున్నారని మండిపడ్డారు. దీనికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని అంటున్నారు. పింఛన్‌పై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి ఉన్నఫలంగా పింఛన్ తొలగించడంతో కుటుంబ పోషణ, వైద్య ఖర్చులకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. దివ్యాంగులకు ఈనెలలో తొలగించిన పింఛన్లు తక్షణమే పునరుద్ధరించాలన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలలో 50 ఏళ్ల నిండిన వారికి పింఛన్లు మంజూరు చేసి ఎన్నికల హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అందుకు స్పందించిన మండల పరిషత్ అధికారి కులాయమ్మ వేంపల్లె మండల వ్యాప్తంగా 548 మంది దివ్యాంగులకు నోటీసులు ఇవ్వగా, 471 మంది పింఛన్‌దారులకు పింఛన్లను రద్దు చేశారు. 77 మంది పింఛన్‌దారులకు వృద్ధాప్య పింఛన్‌ను మంజూరు చేశారు. నోటీసులందుకున్న వారు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి డాక్టర్ దగ్గర పరీక్షలు చేయించుకోవాలన్నారు. డాక్టర్ ఇచ్చిన ధృవ పత్రాన్ని గ్రామ సచివాలయ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. డాక్టర్ వద్ద నుంచి తీసుకొచ్చిన ధృవ పత్ర నోటీసును సచివాలయ ఉద్యోగులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారని తెలిపారు. అప్‌లోడ్ చేసిన తర్వాత వారికి కేటాయించిన తేదీల్లో మళ్లీ డాక్టర్ దగ్గరికి వెళ్తే పరీక్షించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారన్నారు. ఈ ప్రక్రియ అంతా నెల రోజుల్లో పూర్తి చేసుకోవాలని సూచించారు. నోటీసులు వచ్చిన వారికి వచ్చే నెల పింఛన్ వచ్చే అవకాశం ఉండదని తెలియజేశారు.

పింఛన్ రాకపోతే ఎలా బతకాలి?



గత 15 ఏళ్లుగా వికలాంగుల పింఛన్ తీసుకుంటున్నాను. ఇప్పుడు వైద్యులు వైకల్యం తక్కువగా ఉందంటూ పింఛన్ తొలగిస్తే నేను ఎలా బతకాలి. 80 శాతం ఉన్నా వైద్యులు 40 శాతం చూపించి పింఛన్‌ను తొలగించారు. పింఛన్ డబ్బులతోనే సంసారంతో పాటు మందులు కొనుక్కునేవాడిని. పింఛన్ రాకపోతే డబ్బులు ఎవరిని అడుక్కోవాలి.

- షేక్ అబ్దుల్ షుకూర్, దివ్యాంగ పింఛన్‌దారుడు, వేంపల్లె

60 శాతం వైకల్యాన్ని 40 శాతం చూపారు



60 శాతం ఉన్న అంగవైకల్యాన్ని డాక్టర్లు 40 శాతం చూపించి పింఛన్ తొలగించారు. దీంతో వచ్చేనెల నుంచి పింఛన్ నిలిపివేస్తున్నట్లు నోటీసులు ఇచ్చారు. గత పదేళ్లుగా వికలాంగుల పింఛన్ వస్తోంది. అలాంటిది ఉన్నఫలంగా రీ వెరిఫికేషన్‌లో 40 శాతం ఉందని చెప్పారు. పింఛన్‌పైనే జీవనం ఆధారపడి ఉంది.

- కొట్టం గంగులయ్య, కుప్పాలపల్లె, వేంపల్లె

కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది



ప్రస్తుత కూటమి ప్రభుత్వం వికలాంగుల పింఛన్‌దారులపై కుట్రలు పన్నుతోంది. వైకల్యం ఉన్నా కూడా రీ వెరిఫికేషన్ పేరిట శాతాన్ని తక్కువ చూపించి పింఛన్‌ను తొలగిస్తోంది. దివ్యాంగుల బతుకులతో చెలగాటమాడుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదు. ఉద్దేశపూర్వకంగా 500 మందికిపైగా పింఛన్లను తొలగించడం సరికాదు.

- ఆదిమూలం గోపాల్, కుప్పాలపల్లె, వేంపల్లె

వైద్యుల నిర్లక్ష్యమే కారణం



వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తక్కువ శాతాన్ని చూపించారు. అర్హులై ఉండి కూడా వికలాంగుల పింఛన్లను తొలగించడం మంచి పద్ధతి కాదు. 11 ఏళ్లుగా పింఛన్ తీసుకుంటున్నాను. ఉన్నఫలంగా పింఛన్‌ను తొలగించడంవల్ల కుటుంబ పోషణ, వైద్య ఖర్చులకు ఇబ్బందులుపడతాం. అర్హులైన వారి పింఛన్లను తొలగిస్తే ఆందోళన ఉధృతం చేస్తాం.

- టి.శశికుమారి, తాళ్లపల్లి ఎస్సీ కాలనీ, వేంపల్లె

నేడు విద్యార్థులకు అన్నదానం

కమలాపురం : కమలాపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక ఎయిమ్ ఫర్ సేవ (అనాధ బాలుర ఛాత్రాలయం) కేంద్రంలో విద్యార్థులకు మున్సిపల్ వైస్ చైర్మన్ మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేయనున్నారు. అనంతరం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో హార్టికల్చర్ స్టేట్ ఎక్స్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్‌తో పాటు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేయనున్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలన్నారు.

వెబ్‌ల్యాండ్‌లో పేర్లు సక్రమంగా ఉండాలి

కొండాపురం : రైతుల పేర్లు వెబ్‌ల్యాండ్‌లో ఆధార్ కార్డులో పేర్లు ఒకేలా ఉంటేనే అన్నదాత సుఖీభవ లేదా పీఎం కిసాన్ వంటి సంక్షేమ పథకాలకు అర్హులు అని వ్యవసాయ సహాయ సంచాలకు కె.రామమోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని బెడుదూరు, బి.కొట్టాలపల్లె గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2019 తర్వాత రైతులు భూమిని కొనుగోలు చేసిఉంటే అలాంటి రైతులకు పీఎం కిసాన్ రాదని గతంలో అర్హులుగా ఉండి చనిపోతే వారి కుటుంబ సభ్యులకు పీఎం కిసాన్ వర్తిస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అందాలంటే ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన రైతులు ఇ పంట నమోదు చేసుకోకపోతే ఇన్సూరెన్స్ కట్టుకునే సమయంలో ఆన్‌లైన్‌లో పేర్లు ఉండవన్నాను. తప్పనిసరిగా ఇ పంట నమోదు చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి రామంజులరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ అధార్ ప్రతి రైతు చేసుకోవాలన్నారు. వీహెచ్‌ఏ సుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం


పులివెందులలో లూయిస్ దాగు రేకు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్


వేంపల్లెలో వృద్ధులకు అన్నదానం చేస్తున్న ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్

పులివెందుల రూరల్ : పట్టణంలో స్థానిక పాత బస్టాండ్‌లోని అయ్యప్ప స్టూడియోలో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ లూయిస్ దాగు రేకు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లా బకాష్ మాట్లాడుతూ నాటి జ్ఞాపకాలను రేపటి తరాలకు ఫొటోలు, వీడియోలు చూసి ఆనందించడం ఎంతో శుభ పరిణామమన్నారు. యూనియన్ అధ్యక్షుడు శివారెడ్డి, ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ పాల్గొన్నారు.

వేంపల్లె : పట్టణంలో ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్ర పటానికి నివాళులర్పించారు. ఫొటోగ్రఫీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

యువత రక్తదానం చేయాలి

జమ్మలమడుగు : యువత రక్తదానం చేయడం కోసం ముందుకు రావాలని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ రఫీక్‌పాషా తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఫొటో గ్రాఫర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. పాటో గ్రాఫర్లు రక్తదానం చేశారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు నలుగురు విద్యార్థుల ఎంపిక

కమలాపురం : మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన నలుగురు విద్యార్థులు స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైనట్లు పెద్దచెప్పలి జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఫిజికల్ డైరెక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. వేదాస్ స్కూల్‌కు చెందిన సయ్యద్‌మహ్మద్ ఇర్ఫాన్ (5వ తరగతి), కశ్యప్ (5వ తరగతి), పెద్దచెప్పలి ఎంపీపీ స్కూల్‌కు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి (5వ తరగతి), వివేకానంద స్కూల్‌కు చెందిన అర్జున్ (4వ తరగతి)లు స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికైనట్లు ఆయన వివరించారు. ప్రతి రోజు సాయంత్రం పెద్దచెప్పలి జడ్పీ హైస్కూల్‌లో ఈ విద్యార్థులకు వివిధ క్రీడాంశాల్లో పీడీ సునీల్‌కుమార్ శిక్షణ నిచ్చారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించాలనే పట్టుదల ఉండటంతో ఈ విద్యార్థులు ప్రతి రోజు క్రీడల్లో సాధన చేసే వారు. ఈనెల 21వ తేదీన వారు స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలు పొందుతారని పీడీ వివరించారు. గత ఏడాది స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలు చేపట్టక పోవడంతో ఈ ఏడాది 4, 5వ తరగతుల విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారని ఆయన వివరించారు. కాగా తమ పిల్లలు స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికయ్యేలా శిక్షణ నిచ్చిన పీడీ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ముగిసిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

జమ్మలమడుగు : మండలంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా ముగించారు. మండల పరిధిలోని మాలేపాడు గ్రామంలో మాలేపాడు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌వద్ద శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


జన్మాష్టమి వేడుకల్లో ప్రభోద సేవా సమితి సభ్యులు

ప్రపంచ శాంతి కొరకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

పులివెందుల టౌన్ : ప్రపంచ శాంతి కొరకు ప్రతి ఒక్కరు పాటుపడాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. మానవత శాంతి వారోత్సవాలలో భాగంగా మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక ముద్దనూరు రోడ్డులో ఉన్న గాంధీ విగ్రహం వద్ద శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మానవత సంస్థ డైరెక్టర్ సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, చైర్మన్ కొండారెడ్డిలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ గాంధీ విగ్రహం నుంచి ప్రారంభమైన పూలంగళ్ల సర్కిల్‌వరకు సాగింది. అనంతరం అక్కడ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ వారు విద్యార్థులచే ప్రపంచ శాంతి కొరకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలి

పులివెందుల రూరల్ : ప్రతి రైతు పంట నమోదు కార్యక్రమాన్ని తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ చెన్నారెడ్డి తెలిపారు. మంగళవారం పెద్దరంగాపురంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంట నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే పథకాలు వర్తిస్తాయన్నారు. రైతులు డ్రోన్ టెక్నాలజీ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ ఎకరాలకు పురుగు మందులు పిచికారి చేసుకున్నట్లయితే ఖర్చులు ఆదా అవ్వడంతోపాటు పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. ఈనెల 30వ తేదీ వరకు క్రాప్ ఇన్సూరెన్స్ గడువు పొడిగించారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ భాస్కర్‌రెడ్డి ద్రవ జీవామృతాల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించండి

కమలాపురం : పంటలు సాగు చేసిన రైతులు తమ పంట పొలాల్లో సస్యరక్షణ చర్యలు పాటించి పంటలను కాపాడుకోవాలని ఏరువాక డాట్ సెంటర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ అంకయ్య కుమార్, ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం నుంచి ప్రధాన శాస్త్రవేత్త సునీల్‌కుమార్, మాధురి తెలిపారు. మంగళవారం మండలంలోని దాదిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో సాగులో ఉన్న వరి, మినుము పంటలను వారు పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం ఏడీఏ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. వర్షాల కారణంగా మినుము పంటకు బూడిద తెగులు ఆశించిందన్నారు. ప్రస్తుత సీజన్‌లో కంది, జొన్న, ఉలవ పంటలు సాగు చేయవచ్చన్నారు.

క్రాప్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

సింహాద్రిపురం : ఈనెల 30వ తేదీవరకు క్రాప్ ఇన్సూరెన్స్ గడువు పొడిగించిందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ముద్దనూరు ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సింహాద్రిపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఆయన పాల్గొని వ్యవసాయ శాఖలో ఉన్న వివిధ పథకాల గురించి వివరించారు. పథకాలు అమలు కావాలంటే పంట నమోదు కార్యక్రమాన్ని రైతులు తప్పనిసరిగా చేయించుకుంటే ప్రతి రైతు అర్హత కలిగి ఉంటారన్నారు.

ప్రత్యేక నిధుల కోసం నివేదిక పంపాలి

మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల తీర్మాణం


ప్రజల సమస్యలపై అధికారులను నిలదీస్తున్న ఎంపీటీసీ భారతి

వేంపల్లె : వేంపల్లెలో రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చేందుకు ప్రత్యేక నిధుల కింద నిధులు మంజూరు చేసేందుకు కలెక్టర్‌కు సభ్యుల తీర్మాణం మేరకు నివేదిక పంపాలని అధికారులను జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని వైఎస్సార్ సభా భవనంలో ఎంపీపీ లక్ష్మీగాయత్రి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ వేంపల్లెలోని రోడ్లన్నీ గుంతలు గుంతలుగా ఉండటం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్లపై ఉన్న గుంతలను ఆర్అండ్‌బీ అధికారులు పూడ్చకపోతే నిరసన వ్యక్తం చేస్తామని ఎంపీటీసీలు తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతోనే ఎన్టీఆర్ సర్కిల్ నుంచి వర్షపు నీరు ఆయా ప్రాంతాల్లో ప్రవహిస్తోందన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి గుంతలు పూడ్చేందుకు కృషి చేస్తానని ఏఈ మనోహర్‌రెడ్డి తెలిపారు. వేంపల్లె టౌన్ పరిధిలో ఉన్న రైతులకు ఉచితంగా ఇచ్చే విత్తనాలు పంపిణీ చేయలేదని ఎంపీటీసీ మణి గోపాల్‌రెడ్డి సభ దృష్టికి తెచ్చారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు గ్రామాల్లో తెచ్చే సమస్యలపట్ల పంచాయతీ కార్యదర్శులు స్పందించాలని జడ్పీటీసీ తెలిపారు. ప్రభుత్వం అందించే పథకాలపై సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు అధికారులు సమాచారమివ్వాలన్నారు. పాత బాలికల పాఠశాలలో నడుపుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద కళాశాల విశ్రాంతి సమయంలో పోకిరిలు ఎక్కువగా వస్తున్నారని దీంతో అ ప్రాంతంలో ఉన్న మహిళలు ఇబ్బందులు పడుతున్నారని పోలీసులు గస్తీ నిర్వహించాలని ఎంపీటీసీ పద్మాజయలక్ష్మీదేవి కోరారు. హైస్కూల్ వద్ద పోలీసులతో గస్తీని ఏర్పాటు చేస్తామని ఎస్‌ఐ తిరుపాల్ నాయక్ హామీ ఇచ్చారు. వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్స్‌రే మిషన్‌ను అందుబాటులోకి తీసుకరావాలని అలాగే ఆస్పత్రిలో మందుల కొరత ఎక్కువగా ఉందని మండల ఉపాధ్యక్షురాలు మెహతాబ్ తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ప్రజలు ఎక్కువగా రోగాల భారిన పడుతున్నారని తాళ్ళపల్లె వైద్యాధికారి డాక్టర్ నిహారిక తెలిపారు. వేంపల్లెలోని పాత హాల్ వీధిలో నివాసం ఉంటున్న అబ్దుల్ షకుర్ పుట్టుకతోనే గుడ్డివాడని, అలాంటి వ్యక్తికి 45 శాతమే వికలత్వం ఉందని అధికారులు నోటీసులు ఇవ్వడం ఎంత వరకు సబబు అని ఎంపీటీసీలు కోరారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన వారందరికీ వర్తింపజేయాలని అధికారులను ఎంపీపీ లక్ష్మీగాయత్రి కోరారు. అనంతరం ఉపాధి హామీ, ఐసీడీఎస్, గృహ నిర్మాణ శాఖ, సివిల్ సప్లయ్ శాఖలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ కుళ్లాయమ్మ, తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి, ఏఓ శివశంకర్‌రెడ్డి, ఎంఈఓ వెంకటరామిరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు రవణమ్మ, ఎంపీటీసీలు సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, గ్రామ సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఆదాయం


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ శివశంకర్‌రెడ్డి

వేంపల్లె : ప్రకృతి వ్యవసాయంతో పంటలు సాగు చేస్తే అలాంటి రైతులకు మంచి ఆదాయం వస్తుందని మండల వ్యవసాయాధికారి శివశంకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని కుమ్మరాంపల్లెలోని రైతు సేవా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ఏడబ్ల్యూడీపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం చేసే 62 మంది రైతులకు ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్లు శ్రీకాంత్, ప్రతాప్‌లు శిక్షణ ఇచ్చారు. అలాగే ప్రకృతి వ్యవసాయ వరి రైతులు ఒక సెట్ పైపులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడంవలన రైతులకు ఖర్చులు తగ్గడంతోపాటు పంట దిగుబడి ఎక్కువగా వస్తుందన్నారు. వరి పంటలో అవసరానికి మించి నీటిని పెట్టడం వలన భూగర్భ జలాల నీటి శాతం పెరుగుతుందన్నారు. వేరు కుళ్లు 95 శాతం కనుమరుగయ్యే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ సురేఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలి


మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్

వేంపల్లె : పీఆర్సీని అమలు చేయడంతోపాటు పెండింగ్‌లో ఉన్న డీఏలు, ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం వేంపల్లెలో జరిగిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఉద్యోగ, ఉపాధ్యాయులపట్ల పూర్తిగా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ వారిని పాత పెన్షన్ విధానంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉపయోగించుకోబోమని ఒకవైపు చెబుతూనే మరొక వైపు రకరకాల యాప్‌లతో, వివిధ రకాల శిక్షణలు, ఫార్మేటివ్ అసెస్మెంట్ పుస్తకాలను ఉపాధ్యాయులే పూర్తించాలని చెప్పడం శోచనీయమన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోలేని పక్షంలో పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు రమణ, చెరుకూరి శ్రీనివాసులు, సీపీఎస్ జిల్లా కన్వీనర్ సుదర్శన్, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ వెంకటరమణ పాల్గొన్నారు.

జైళ్ల శాఖ పెట్రోల్ బంకుల్లో ఏం జరుగుతోంది?

- కడప రేంజ్ డీఐజీ పరిధిలోని ధర్మవరం, బనగానపల్లి పెట్రోల్ బంక్‌ల్లో అవినీతి
- ధర్మవరం పెట్రోల్ బంకులో రూ.20 లక్షల అవినీతి వ్యవహారంలో నలుగురి చేతివాటం
- బనగానపల్లి పెట్రోల్ బంకులో రూ. 60 లక్షల మేర అవినీతి
- కర్నూలు డీఎస్‌డీ, బనగానపల్లి డిప్యూటీ జైలర్, ఓ హెడ్ వార్డర్ చేతివాటం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: జైళ్ల శాఖ కడప రేంజ్ డిఐజీ పరిధిలోని పెట్రోల్ బంకుల్లో అవినీతి తవ్వేకొద్దీ రోజురోజుకూ బయట పడుతోంది. పలువురు సిబ్బంది బంకుల్లోని సొమ్ము కాజేసినట్లు తెలుస్తోంది. ప్రధానంగా అనంతపురం జిల్లా ధర్మవరం పెట్రోల్ బంకు పరిధిలో అప్పటి డీఐజీ, అనంతపురం డీఎస్‌డీఓ, అక్కడ జైలర్‌గా పనిచేస్తూ బదిలీపై కడప కేంద్ర కారాగారానికి వచ్చిన మరో జైలర్, ధర్మవరం డిప్యూటీ జైలర్‌గా పనిచేస్తూ ప్రస్తుతం తాడిపత్రికి బదిలీపై వెళ్లిన డిప్యూటీ జైలర్ ఈ వ్యవహారంలో చేతివాటం ప్రదర్శించినట్లు తెలిసింది. సదరు డిప్యూటీ జైలర్ పెట్రోల్ బంకు నిర్వహణ ఛార్జ్ డీఎస్‌డీఓకు అప్పగించే క్రమంలో ఈ లొసుగులు బయటపడినట్లు తెలిసింది. రూ.20 లక్షల పెట్రోల్ బంకు డబ్బులు, 1.50 లక్షలు పీపీసీ (ప్రిజనర్స్ పార్టిసిపేషన్ క్యాష్) తక్కువగా ఉండడంతో డీఎస్‌డీఓ ఛార్జ్ తీసుకునేందుకు నిరాకరించారు. దీంతో ప్రస్తుతం వార్డర్‌లే పెట్రోల్ బంకు నిర్వహిస్తున్నారు. అప్పటి కీలక అధికారి పెద్ద మొత్తంలో డబ్బును తన అవసరాలకు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఆ అధికారి తీసుకున్న మొత్తం డబ్బు బంధువులు, వార్డర్స్ ఫోన్‌పేల రూపంలో చెల్లించినట్లు సమాచారం. డిప్యూటీ జైలర్ తాను చెల్లించాల్సిన డబ్బును చెల్లించకపోవడం, ఇతర కారణాలతో అప్పట్లో డిపార్ట్‌మెంట్ అతడిని డిస్మిస్ చేసింది. ఆ డిప్యూటీ జైలర్ వాడుకున్న మొత్తాన్ని ఎవరు కట్టాలో.. దిక్కుతోచక ఒక కమిటీని నియమించి కడప రేంజ్ డిఐజీ విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

ఇక బనగానపల్లి మాటేమిటో..!

కడప రేంజ్ డిఐజీ పరిధిలో వున్న మరో పెట్రోల్ బంక్ బనగానపల్లిలో వుంది. ఈ పెట్రోల్ బంకులో రూ. 62 లక్షల మేరకు అవినీతి జరిగింది. ఈ అవినీతికి పాల్పడిన వారిలో ప్రధానంగా కర్నూలు డీఎస్‌డీఓతో పాటు, డిప్యూటీ జైలర్, ఓ హెడ్ వార్డర్ చేతివాటం ఉన్నట్లు తెలిసింది. ఇందులో డీఎస్‌డీఓకు అడిషనల్ ఎస్పీ ర్యాంక్‌తో పదోన్నతి కల్పించేందుకు రంగం సిద్ధమైంది. ఈ క్రమంలో బనగానపల్లి పెట్రోల్ బంకు వ్యవహారం బయటకు రాకుండా డీఎస్‌డీఓకు అనుకూలమైన ప్రస్తుత కీలక అధికారి తమ వంతు విచారణ జరగకుండా తొక్కిపెట్టినట్లు సమాచారం. ఐతే ఒక హెడ్ వార్డర్ బనగానపల్లిలోని పెట్రోల్ బంకు నిర్వహిస్తూ ఇటీవల ఆళ్లగడ్డకు బదిలీ అయ్యాడు. ఈ క్రమంలో బనగానపల్లి పెట్రోల్ బంకు అవినీతి బయటపడింది. ఆళ్లగడ్డలో రిపోర్ట్ చేసుకోవాల్సిన హెడ్ వార్డర్ ఉన్నతాధికారుల ఇబ్బందులతో వాడుకున్న డబ్బులను జీపీఎఫ్ ద్వారా డబ్బులను డ్రా చేసి రూ.10 నుంచి 12 లక్షల మేరకు చెల్లించినట్లు సమాచారం. డిప్యూటీ జైలర్ తన పరిధిలో తాను వాడుకున్న మొత్తంలో రూ. 10 లక్షల మేరకు కట్టినట్లు సమాచారం. డీఎస్‌డీఓ పరిధిలో రూ.15 లక్షల మేర చెల్లించారు. మిగిలిన రూ. 23 లక్షలను హెడ్ వార్డర్‌ను చెల్లించాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తీసుకుని రావడంతో తాను విచారణకు సిద్ధమని, అందరినీ బహిరంగంగా విచారించాలని పట్టుబట్టాడు.

తొలగించబడిన పింఛనుదారులు దరఖాస్తు చేసుకోవాలి

ముద్దనూరు : పింఛను తొలగించబడిన పింఛనుదారులు తిరిగి మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ పరిపూర్ణ అరుంధతి మంగళవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. తొలగించబడిన పింఛన్లలో ఎక్కువ శాతం వికలాంగులు వున్నారని, ఈ పింఛనుదారులంతా ఆయా సచివాలయాల్లో మొదట వేలిముద్రలు వేసి తర్వాత ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని ఆమె సూచించారు.